సాక్షి
కృష్ణాజిల్లా
శనివారం । 9 । నవంబర్ । 2024



## కృష్ణానదిలో సీ ప్లేన్ ట్రయల్ రన్

భవానీపురం: కృష్ణానదిలో డీ హవిల్లాండ్ ఎయిర్ క్రాఫ్ట్ సంస్థ సీ ప్లేన్ ట్రయల్ రన్‌ను శుక్రవారం నిర్వహించింది. సీ ప్లేన్ ట్రైల్ రన్‌ను ప్రజలు ఆసక్తిగా తిలకించారు



## 41,224 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 37,450 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి 41,224 బస్తాలను విక్రయించారు.

## దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి హైదరాబాద్‌లోని రాయదుర్గంనకు చెందిన కె. రామకృష్ణ శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు. అనంతరం అమ్మను దర్శించుకున్నారు.

## న్యూస్‌రీల్

### కార్తికేయుని నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి ఏలూరు జిల్లా పూళ్ల గ్రామానికి చెందిన బొండాడ నాగేశ్వరరావు కుమారులు సబ్బరాజు, రాజా, సుధీర్ రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. శుక్రవారం సాయంత్రం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్‌శర్మకు విరాళాన్ని అందజేశారు. ఆలయ మర్యాదలతో దాత కుటుంబ సభ్యులను సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పవర్ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఇబ్రహీంపట్నంలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగింది. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. మోహనరావు, ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా నరసింహారావు, అబ్దుల్ హమీద్‌బాషా, మరో ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నారు. మూడేళ్లుగా యూనియన్ చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష చేశారు. అధ్యక్షుడు మోహనరావు మాట్లాడుతూ.. తెలంగాణ తరహాలో కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు పలికారు.

### లబ్ధిదారుల ఇంటి వద్దే ఈకేవైసీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులైన వినియోగదారుల ఇంటి వద్దే గ్యాస్ డెలివరీ బాయ్స్‌తో ఈకేవైసీ నమోదు చేయిస్తున్నామని, దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా శుక్ర వారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేసే పథకాన్ని అక్టోబర్ 31న ప్రారంభించిందని తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలోని 55 గ్యాస్ ఏజెన్సీల్లో ఉచిత సిలిండర్ల బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఈ పథకానికి బియ్యం కార్డు, గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ కలిగిన వారు అర్హులని తెలిపారు. వినియోగదారులు తమ మొదటి ఉచిత సిలిండర్‌ను 2025, మార్చి 31వ తేదీ లోపు బుక్ చేసుకోవచ్చని సూచించారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో గ్యాస్ సిలిండర్ ధర మొత్తం జమవుతుందని తెలిపారు. ఈకేవైసీ చేయించని గ్యాస్ వినియోగదారులకు వారి ఇంటి వద్దనే గ్యాస్ డెలివరీ బాయ్స్‌తో ఈకేవైసీ చేయించేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. గ్యాస్ వినియోగదారులకు దీనిపై ఏమైనా ఫిర్యాదులు ఉంటే 1967 టోల్ ఫ్రీ నంబరును లేదా సమీపంలోని సచివాలయంలో సంప్రదించాలని కోరారు.

### సోలార్ మోడల్ గ్రామాల ఎంపికకు తీర్మానం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఐదు గ్రామాలను సోలార్ మోడల్ గ్రామాలుగా ఎంపిక చేయాలని సమావేశంలో తీర్మానించారు. జిల్లా కలెక్టరేట్‌లో 'ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పథకం అమలుపై చర్చించారు. సోలార్ మోడల్ గ్రామాలుగా ఐదు వేల జనాభాకు పైబడిన ఐదు గ్రామాలను ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు ఎస్ఈ ఎ.మురళీమోహన్ తెలిపారు. ఈ పథకం కింద గృహ వినియోగదారులకు అందించే రాయితీలు, మోడల్ గ్రామాల ఎంపిక, బ్యాంకర్ల నుంచి లబ్ధిదారులకు రుణ సదుపాయం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పోస్టర్లను డీఆర్వో ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఈఈ టెక్నికల్ యు.హనుమయ్య, జిల్లా నోడల్ అధికారి ఎం.భాస్కరరావు, టౌన్ ఈఈ పి.రవీంద్రబాబు, పి.హరిబాబు, ఎం.వసంతరావు, ఎ.సత్యనారాయణ, బ్యాంక్ కోఆర్డినేటర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో దారిద్ర్యం

- భారీ వర్షాలు, వరదలకు పల్లెల్లో ధ్వంసమైన రహదారులు
- జిల్లాలో 202 రోడ్లు 432 కి.మీ. మేర దెబ్బతిన్న రోడ్లు
- రూ.60 కోట్లు కావాలని నివేదిక పంపిన అధికారులు
- పంచాయతీ రాజ్ రోడ్లకు పైసా కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం
- డెప్యూటీ సీఎం చేతిలో గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నా ఫలితం శూన్యం
- నిధులు లేక రోడ్లపై గుంతలు పూడ్చలేమంటున్న అధికారులు
- రెండు అడుగుల లోతు గుంతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



ధ్వంసమైన మచిలీపట్నం హైవే - గుండుపాలెం రోడ్డు

సాక్షి, మచిలీపట్నం: జిల్లాలోని అనేక గ్రామాల్లో రోడ్లు ఛిద్రమై దుర్భర పరిస్థితిలో దర్శనమిస్తున్నాయి. రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదల కారాణంగా దెబ్బతిన్న ఈ రోడ్లను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. కొన్ని చోట్ల రోడ్లపై సుమారు రెండు అడుగుల లోతు గుంతలు ఏర్పడటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు. పల్లెలు బాగుంటేనే పట్టణాలు, నగరాలు బాగుంటాయి. వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ధాన్యాలు, కూరగాయలు గ్రామీణ ప్రాంతాల నుంచే పట్టణలకు సరఫరా అవుతాయి. అయితే, దెబ్బతిన్న పల్లె రోడ్లను ప్రభుత్వం గాలికి వదిలేసింది. రోడ్ల మరమ్మతులకు నిధులు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపితే బుట్టదాఖలు చేసింది. ఒక్క పైసా కూడా విడుదల చేయకుండా రోడ్ల ఊసే ఊసే మరిచింది. డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్నా ఫలితం మాత్రం శూన్యంగానే ఉందని జిల్లా ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### దెబ్బతిన్నవి ఇలా..

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదలతో జిల్లాలో అన్ని శాఖలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంచాయతీ రాజ్ శాఖకు భారీగానే నష్టం జరిగింది. ఆర్ అండ్ బీ రోడ్ల నుంచి గ్రామాలకు వెళ్లే వివిధ రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలో 202 రోడ్లు 432.63 కిలో మీటర్ల మేర దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. పలు ప్రాంతాల్లో రోడ్ల గండ్లు పడటం, కోతకు గురవడంతో పాటు సీడీ వర్క్, డ్యామేజీలు ఉన్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలు, గండ్ల కారణంగా రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**వరదల్లో దెబ్బతిన్న రోడ్ల వివరాలు**

| నియోజకవర్గం పేరు | దెబ్బతిన్న రోడ్లు | కిలో మీటర్లు | నిధుల ప్రతిపాదనలు (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| అవనిగడ్డ | 60 | 130.21 | 26.77 |
| గన్నవరం | 25 | 59.73 | 8.51 |
| పామర్రు | 55 | 110.85 | 9.06 |
| పెనమలూరు | 21 | 55.99 | 5.73 |
| గుడివాడ | 13 | 25.20 | 3.60 |
| మచిలీపట్నం | 12 | 19.95 | 1.71 |
| పెడన | 16 | 30.70 | 4.59 |
| మొత్తం | 202 | 432.63 | 59.97 |

### డెప్యూటీ సీఎం ఉన్నా.. ఫలితం సున్నా

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వరదల కారణంగా జిల్లాలోని 202 రోడ్లు 432.63 కిలో మీటర్ల మేర దెబ్బతిన్నాయని అధికారులు తేల్చారు. సుమారు రూ.60 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించారు. అయినా పైసా కూడా మంజూరు కాలేదు. రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



సగానికి పైగా కోతకు గురైన మచిలీపట్నం హైవే నుంచి గుండుపాలెం వెళ్లే రహదారి

### రూ.60 కోట్లతో ప్రతిపాదనలు

వరదల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న రోడ్లకు సంబంధించి పంచాయతీ రాజ్ అధికారులు సర్వేలు నిర్వహించి నివేదికలు తయారు చేశారు. వీటిని బాగు చేసేందుకు సుమారు రూ.60 కోట్లు కావాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వాస్తవానికి దెబ్బతిన్న రోడ్లకు రూ.150 కోట్లు కావాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, కృష్ణా జిల్లాకు రూ.60 కోట్లకు మించి ఇవ్వలేని పరిస్థితి ఉందని, ఆ లోపే ప్రతిపాదనలు పంపించాలని సూచించినట్లు సమాచారం. దీంతో అప్పటికప్పుడు అధికారులు అంచనా విలువలను తగ్గించి, సుమారు రూ.60 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ప్రతిపాదనలు పంపి రెండు నెలలైనా ఇప్పటి వరకు ప్రభుత్వం పైసా కూడా మంజూరు చేయలేదు. వరదల్లో దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు రూ.60 కోట్లతో ప్రతిపాదనలు పంపిచామని, ఇప్పటి వరకు ఏమీ రాలేదు, నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణ్ రావు తెలిపారు.

### సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల రాష్ట్ర జట్లు ఎంపిక



బెస్ట్ ఫిజిక్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో ప్రదర్శన ఇస్తున్న సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు

విజయవాడస్పోర్ట్స్: క్రికెట్, బెస్ట్ ఫిజిక్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల రాష్ట్ర జట్లను ఇందిరా గాంధీ స్టేడియంలో శుక్రవారం ఎంపిక చేసినట్లు ఎన్టీఆర్ డీఎస్‌డీఓ ఎస్.ఎ.అజీజ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 186 మంది ఉద్యోగులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. కోచ్‌లు, అబ్జర్వర్లు షేక్ సయ్యద్ సాహెబ్, ఎ.సాయికుమార్, వి.వసంత్‌కుమార్, ఎం.రమేష్‌బాబు, టి.ప్రవీణ్, ఎం.రమేష్ బాబు, సాంబశివరావు పర్యవేక్షణలో జట్లను ఎంపిక చేశామని వివరించారు.

### తొలి రోజు రైల్వేస్ స్కోర్ 351



151 రన్స్ చేసిన అన్షిత్‌యాదవ్

విజయవాడస్పోర్ట్స్: కల్నల్ సీకే నాయుడు అండర్ -23 మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లో ఇండియన్ రైల్వేస్ జట్టు దూకుడు ప్రదర్శించింది. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఏసీఏ మైదానంలో శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుతో రైల్వేస్ తలపడింది. టాస్ గెలిచిన రైల్వేస్ బ్యాటింగ్ ఎంచుకుని తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లకు ఆరు వికెట్లు నష్టపోయి 351 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు అన్షిత్‌యాదవ్ 151, జయంత్‌లక్ష్మాన్ 58 (నాటౌట్), ఇషాన్‌గోయల్ 50 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు ఇస్మాయిల్, వాసు, సాకేత్‌రామ్ రెండేసి వికెట్లు తీశారు.

# అందరికీ అందుబాటులో న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

చిలకలపూడి(మచిలీపట్నం): 'అందరికీ న్యాయం.. అందుబాటులో న్యాయం' నినాదంతో న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక అన్నారు. జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన న్యాయమూర్తి అరుణసారిక మాట్లాడుతూ.. రాజీ మార్గం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశాన్ని ఈ సంస్థ ద్వారా కల్పిస్తున్నామని తెలిపారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ.. కేసులను సత్వరం పరిష్కరించుకుంటే వివాదాలకు తావుండదని, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఇందు కోసం న్యాయసేవాధికార సంస్థను ఏర్పాటు చేశారని వివరించారు. న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య మాట్లాడుతూ.. జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని ఏటా నవంబర్ తొమ్మిదో తేదీన జరుపుకొంటామని, అందుకు ముందుగా న్యాయసేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో న్యాయం పొందే హక్కు కూడా ఒక భాగంగా ఉందని, దానిని అమలు చేసేందుకే 1987వ సంవత్సరంలో న్యాయసేవాధికార సంస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిని 1995 నుంచి ప్రజల్లోకి అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. కక్షిదారులకు, పేద ప్రజలకు ఉచిత న్యాయసహాయం, సలహాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కోర్టు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# 18న వీఆర్‌ఏల సామూహిక రాయబారం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18వ తేదీ చేపట్టిన సీసీఎల్ఏకు సామూహిక రాయబార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. నిబంధనలకు పాతరేసి వీఆర్ఏలపై రాష్ట్ర ప్రభుత్వం మోపిన చట్టవిరుద్ధమైన నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపు డ్యూటీలు, రైస్ మిల్లు డ్యూటీలు వెంటనే రద్దు చేయాలని, తెలంగాణ మాదిరిగా పేస్కేల్ అమలు చేయాలని, ప్రమోషన్లు, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించడం తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొంది. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ.. నెలకు వచ్చే రూ.10,500 జీతంతో వీఆర్ఏల కుటుంబాలు గడవక పస్తులతో రోజులు నెట్టుకొస్తున్నారని, ప్రతిపక్ష నాయకుడి హోదాలో ప్రస్తుత సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలు అందరూ ఐక్యమై జీతాల పెంపు, చట్ట విరుద్ధమైన డ్యూటీల రద్దు, ప్రమోషన్లు, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించే వరకు రాజీలేని పోరాటం చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వీఆర్ఏల జీతాలను రూ.15 వేలకు పెంచుతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నెల 11వ తేదీ నుంచి జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో వీఆర్ఏల జీతాల పెంపునకు సానుకూల నిర్ణయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు త్రినాథ రావు, గట్టు వెంకన్న, కొండబాబు, ఈశ్వరరావు, బాజీ బాబు పాల్గొన్నారు.

**సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గట్టు వెంకన్న**

విజయనగరంజిల్లాకు చెందిన గట్టు వెంకన్నను రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా వీఆర్ఏల సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న టి.అంజి వ్యక్తిగత పోకడలతో, సంఘ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న నేపథ్యంలో సంఘం నుంచి బహిష్కరిస్తూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సంఘ విద్రోహానికి పాల్పడుతున్న అంజి చేస్తున్న దుష్ప్రచారాన్ని వీఆర్ఏలు నమ్మి మోసపోవద్దని ఈ సమావేశం విజ్ఞప్తి చేసింది.

# మద్దతుకు ప్రాధాన్యం ఏదీ?

- బస్తా ధర రూ.1,600 నుంచి రూ.1,400కు పడిపోయిన వైనం
- వైఎస్సార్ సీపీ పాలనలో రూ.1,600 నుంచి రూ.2 వేల ధర
- రైతులు నష్టపోతున్నా తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు



కూడూరులో కోత యంత్రం నుంచి ధాన్యం సేకరిస్తున్న రైతులు

పెడన: రైతుల ఆరుగాలం కష్టం ఫలించింది. ధాన్యం దిగుబడులు చేతికి వస్తున్నాయి. పంట దిగుబడులు సైతం ఆశాజనకంగానే ఉన్నాయి. అయితే మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. సాధారణ రకం 75 కిలోల బస్తాకు రూ.1,725, గ్రేడ్ ఏ రకానికి రూ.1,740 చొప్పున కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించింది. వరికోతలు మొదలై ధాన్యం రైతుల ఇళ్లకు చేరుతున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభంచలేదు. ఎప్పటికి ప్రారంభించేదీ ప్రకటించలేదు. అప్పులు చేసి వ్యవసాయ పెట్టుబడులకు వెచ్చించిన రైతులు పంటను విక్రయించి బాకీలు తీర్చాలని భావిస్తున్నారు. వారి అవసరాను ఆసరాగా తీసుకున్న కొందరు మిల్లర్లు, దళారులు మద్దతు ధరను కొండెక్కించారు. బీపీటీ రకం 75 కిలోల బస్తాను రూ.1,400 నుంచి రూ.1,500కు మించి కొనుగోలు చేసేది లేదని తేల్చిచెబుతున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకున్నాయి. ఫలితంగా ధాన్యానికి గిట్టుబాటు ధర లభించింది. ధాన్యాన్ని రైతులు గట్టుమీదకు చేర్చడమే తరువాయి బస్తాకు రూ.1600 నుంచి రూ.2 వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇప్పుడు ధాన్యం కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ దఫా ఖర్చులు బాగా పెరిగాయని, మద్దతు ధర కూడా లేకపోతే నష్టాలు తప్పవని పేర్కొంటున్నారు.




పెడన మండలం నందిగామలో ధాన్యాన్ని కాటా వేస్తున్న కూలీలు

### ప్రారంభంకాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

పెడన నియోజకవర్గంలో వరి కోతలు మొదలయ్యాయి. అయినా పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. డీసీఎంఎస్ ద్వారా 23 కేంద్రాలు, పీఏసీఎస్‌లు 31, రెండు ఎఫ్‌పీఓల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని పేర్కొంటూ వ్యవసాయశాఖ అధికారులు కరపత్రాలు, ఫ్లెక్సీలు ముద్రించి ఆయా కేంద్రాలకు పంపించారు. సిబ్బందిని నేటి వరకు వాటిని ప్రదర్శించడంలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొంటున్నారు. రైతులు మద్దతు ధర అడిగితే అంత మొత్తం తాము ఇవ్వలేమంటూ తిరిగి వెళ్లిపోతున్నారు. దీంతో చేసేది లేక రైతులు ధాన్యాన్ని ఇళ్లకు తీసుకెళ్లి ఆరబెట్టుకుంటున్నారు. అప్పుల ఒత్తిడి ఉన్నవారు వచ్చిన ధరకే ధాన్యాన్ని తెగనమ్ముతున్నారు.

### కనీస ధర కూడా రావడం లేదు



కనీస ధరకు కూడా ధాన్యం కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. నిరుడు బీపీటీ హాట్ కేక్‌లా అమ్ముడుపోయింది. ధాన్యం మాకంటే మాకు కావాలంటూ రూ.1,600 నుంచి రూ.2 వేలకు కొనుగోలు చేశారు. ఇప్పుడు రూ.1,450 లేదా రూ.1,500 మించి ఇవ్వడం లేదు. అదేమంటే ధాన్యంలో పచ్చిదనం పోలేదని, ముక్క అయిపోతున్నాయని అంటున్నారు. చాలా దారుణ పరిస్థితులున్నాయి.

– కాగిత వెంకటేశ్వరరావు, రైతు, కూడూరు, పెడన మండలం

### బేరం కుదిరింది



ప్రస్తుతం వాతావరణం బాగుంది. ఈ సారి వరి పంట బాగానే పండింది. ప్రతి సంవత్సరం మా ఊరికి చెందిన ధాన్యం వ్యాపారి వద్ద విక్రయిస్తుంటా. ఈ దఫా కూడా ఆయనకే విక్రయించాలని నిర్ణయించా. ప్రస్తుతం ధాన్యాన్ని కాటా పెట్టిస్తున్నా. 75 కిలోల బస్తాను రూ.1,500 విక్రయించేలా వ్యాపారితో బేరం కుదిరింది.

– యార్లగడ్డ చినధర్మయ్య, నందిగామ, పెడన మండలం

### చర్చలు జరుగుతున్నాయి..



వరి కోత పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకుంటాయి. ప్రస్తుతం మిల్లర్లు, బ్యాంకర్లతో ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన వాటిని మిల్లర్లకు పంపించాలి. మిల్లర్లతో అధికారులు చర్చలు జరిపిన అంగీకరమైన వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరుచుకుంటాయి. ధర ఎక్కడ అధికంగా వస్తుందో అక్కడే పంటను విక్రయించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది.

– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు, పెడన

## క్లుప్తంగా

### ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు



చిలకలపూడి(మచిలీపట్నం): మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి టీవీజే రామారావు ఉత్తర్వులు అందజేశారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లకు మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, గుడివాడ మునిసిపాలిటీ పరిధిలో ఒక్కొక్క స్కూల్ అసిస్టెంట్‌కు గ్రేడ్–2 హెడ్ మాస్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులకు ఈమేరకు ఉత్తర్వులు అందజేశారు.

### వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



కృత్తివెన్ను: మండలంలోని సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై వ్యాన్ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో జరిగింది. కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం సీతనపల్లి గ్రామానికి చెందిన అర్జంపూడి శ్రీనివాసరావు (43) కృత్తివెన్ను సెంటర్‌కు వస్తుండగా లక్ష్మీపురం నుంచి బంటుమిల్లి వైపు వెళ్తున్న వాహనం వెనుకనుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మరణించాడు. ఢీకొట్టిన వాహనం ఆగకుండా వెళ్లిపోవడంతో సీసీ కెమెరాల ద్వారా వాహనాన్ని గుర్తించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

### భార్య వెనుకే భర్త మృత్యుఒడికి...



పెడన: భార్య మృతిని జీర్ణించుకోలేని భర్త కూడా ఆమె వెంటే మృత్యుఒడిలోకి చేరిన ఘటన పెడనలో చోటు చేసుకుంది. పట్టణంలోని బంటుమిల్లి రోడ్డు కరణం వారి వీధిలో శింగరాజు వెంకటరమణ(70), సుగుణవల్లి(65) దంపతులు నివాసం ఉంటున్నారు. సుగుణవల్లి అనారోగ్యానికి గురవడంతో గుంటూరులో చికత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని గురువారం సాయంత్రం పెడనలోని స్వగృహానికి తీసుకువచ్చారు. భార్య మృతిని తట్టుకోలేని వెంకటరమణ శుక్రవారం వేకువ జామున తుదిశ్వాస విడిచారు. ఇరువురూ గంటల వ్యవధిలో మృతి చెందడం వారి కుటుంబసభ్యులు, బంధువులను కలిచివేసింది. వీరికి ఒక కుమార్తె ఉన్నారు. దంపతులకు శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలను నిర్వహించారు.


# సాగరమాల ప్రాజెక్టు అటకెక్కినట్లేనా?

- నాగాయలంకలో ఫ్లోటింగ్ జెట్టీల బెర్తింగ్ నిర్మాణం ఏమైనట్లు?
- 2021లోనే కేంద్రానికి అందిన డీపీఆర్
- అప్పటి మార్కెట్ రేటు ఆధారంగా అంచనా వ్యయం రూ.7.52 కోట్లు



నాగాయలంకలో ప్రతిపాదిత ప్రాంతం(డీపీఆర్‌లో నివేదిత చిత్రాలు)(ఫైల్)

నాగాయలంక: కేంద్ర ప్రభుత్వం సాగరమాల ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన కృష్ణాజిల్లా నాగాయలంక ఫిష్ లాండింగ్ సెంటర్‌లో ఫ్లోటింగ్ జెట్టీల బెర్తింగ్ నిర్మాణం అటకెక్కినట్లేననే అనుమానాలు రేకెత్తుతున్నాయి. మత్స్య పరిశ్రమ, సముద్ర పర్యాటకం సంబంధిత నైపుణ్యాభివృద్ధి సాగరమాల లక్ష్యంగా నిర్దేశించారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్(ఓడరేవు నేతృత్వంలోని అభివృద్ధి)లో తీరప్రాంత కమ్యూనిటీ అభివృద్ధి మత్స్యకారులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగిస్తుంది. ఇలాంటి బృహత్తరమైన పథకం పరిధిలో కృష్ణా జిల్లా నాగాయలంకలో ఫ్లోటింగ్ జెట్టీల బెర్తింగ్ నిర్మాణాన్ని 156 మీ. పొడవు–4.8 మీ. వెడల్పుతో ప్రతిపాదించారు. 2017లో ఒకసారి సూత్రప్రాయ ప్రాజెక్ట్ రిపోర్ట్(పీఆర్)నివేదించినట్లు తెలుస్తోంది. తీరంలో ఫ్లోటింగ్ ప్లాట్‌ఫారమ్ లను ఉపయోగించి వాటి మౌలిక సదుపాయాల స్థాయి అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆసక్తి చూపడంతో సాగరమాల కింద చెన్నైకి చెందిన నేషనల్ టెక్నాలజీ సెంటర్ ఫర్ పోర్ట్స్ వాటర్ వేస్ అండ్ కోస్ట్స్ (ఎన్‌టీసీపీడబ్ల్యూసీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ ఇంజినీరింగ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీఎం)సాంకేతిక పరి/జ్ఞాన సంస్థ టీమ్‌ను పిలిపించడంతో ప్రొఫెసర్లు కె.మురళి, ఎస్.ఎ.సన్నాసిరాజ్ నేతృత్వంలో రూ.7.52 కోట్ల అంచనా వ్యయంతో 2021లో డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను కేంద్రానికి నివేదించారు. అధికారులు సూచించిన నాగాయలంక కృష్ణానది శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్(ఫిష్ లాండింగ్ సెంటర్)ప్రదేశంలో ఫ్లోటింగ్ జెట్టీని నిర్మించడానికి ఈ డీపీఆర్ స్పష్టంగా సిఫారసు చేస్తూ ఆగస్టు 2021లో నివేదిక సమర్పించింది. కాని కేంద్ర సాగరమాల సెల్ మాత్రం ఇంత వరకు కార్యాచరణ చేపట్టక పోవడంతో నాగాయలంకలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం అటకెక్కినట్లేనని తీర ప్రాంత మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాజెక్టు ఇక్కడ నిర్మించడం ద్వారా నాగాయలంక, కోడూరు తీరప్రాంతాల మత్స్యపరిశ్రమకు, మత్స్యకారుల అభ్యున్నతికి దోహదపడగలదని ఆయా వర్గాలు ఆశ పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సాగరమాల ద్వారా డీపీఆర్‌ను అమలు చేసి నాగాయలంకలో ప్రతిపాదిత బెర్తింగ్ సౌకర్యాల సృష్టిని విజయవంతం చేయాలని కోరుతున్నారు.



నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం ఘాట్ వద్ద ఫిష్ లాండింగ్ నదీ పరీవాహక ప్రాంతం(డ్రోన్ చిత్రం)

### ఈ ప్రాజెక్ట్(డీపీఆర్)లో ముఖ్యాంశాలు

- నాగాయలంకలో బెర్తింగ్ సౌకర్యాల కల్పన కోసం వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్)–ఆగస్టు 2021ను సాగరమాల సెల్ అందించారు.
- మత్స్యకారుల అభ్యున్నతిలో బోట్‌ల బెర్తింగ్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నారు.
- ఈ ప్రదేశంలో తేలియాడే జెట్టీ ప్లాట్‌ఫారమ్ అందించాలని నివేదిక సిఫారసు చేసింది.
- అప్పటి మార్కెట్ రేటు ఆధారంగా ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయం రూ.7.52 కోట్లతో ప్రతిపాదిత పథకం–నాలుగు ఫైబర్ బోట్‌లకు వసతి కల్పించే రీతిలో ఫ్లోటింగ్ పాంటూన్ యూనిట్ల గురించి మెరుగైన అవగాహనను రిపోర్ట్‌లో అందించారు.
- 2021 జూలైలో నాగాయలంకలో ఎన్‌టీసీపీడబ్ల్యూసీ అధికారులు సైట్ ఇన్వెస్టిగేషన్ నిర్వహించి క్షేత్ర విశ్లేషణ, సమావేశాలు, చర్చలు, పరిశోధనలతో అదనపు డేటా సమీకరించుకున్నారు.

# ఉత్సాహంగా కృష్ణా వర్సిటీ స్విమ్మింగ్ పోటీలు



స్విమ్మింగ్ పోటీలను ప్రారంభిస్తున్న శాతవాహన కాలేజీ కరస్పాండెంట్ రమాసత్యనారాయణ

విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల స్విమ్మింగ్ పోటీలు శాతవాహన కాలేజీ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని సర్ విజ్జి మునిసిపల్ కార్పొరేషన్ పూల్‌లో శుక్రవారం ఉత్సాహభరితంగా సాగాయి. ఆరు కళాశాలల క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించారని పోటీల కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ బి.సి.హెచ్.సంగీతరావు తెలిపారు. 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో కృష్ణవేణి కాలేజీ విద్యార్థి ఎస్.హర్షవర్ధన్ ప్రథమ, పీబీ సిద్ధార్థ కాలేజీ విద్యార్థులు టి.కార్తికేయ, ఎం.హర్షవర్ధన్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో పీబీ సిద్ధార్థ విద్యార్థులు ఎండీ పర్వేజ్ మహారూప్, టి.కార్తికేయ ప్రథమ, ద్వితీయ స్థానాలు, 50 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో పీబీ సిద్ధార్థ విద్యార్థులు పర్వేజ్ మహారూప్, కార్తికేయ, చంద్రశేఖర్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం వర్సిటీ జట్టు ఎంపిక కమిటీ సభ్యులు డాక్టర్ డి.యుగంధర్, డి.హేమచంద్రరావు పర్యవేక్షణలో వర్సిటీ జట్టును ఎంపిక చేశారు. తొలుత ఈ పోటీలను శాతవాహన కాలేజీ కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె.శంకరరావు జెండా ఊపి ప్రారంభించారు.

# కృష్ణా వర్సిటీ కబడ్డీ చాంపియన్ మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల



మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కబడ్డీ విజేతలను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

మైలవరం: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల కబడ్డీ(మహిళలు) పోటీలలో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజేతగా నిలిచింది.డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల కబడ్డీ(మహిళలు)పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుపై విజయం సాధించి డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కృష్ణా యూనివర్సిటీ చాంపియన్‌గా నిలిచింది. రెండవ స్థానంలో ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల, మూడవ స్థానంలో విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాల నిలిచాయి. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఢిల్లీశ్వరి, అశ్విని అద్భుత ప్రతిభ కనబర్చి బెస్ట్ ప్లేయర్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విజేతలను అభినందించారు.

### రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య,లక్ష్మీనరసింహశాస్త్రి

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో శుక్రవారం అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పవర్ లిఫ్టింగ్ పోటీలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ జనరల్ సెక్రటరీ డి.దినేష్‌బాబు మాట్లాడుతూ ఫస్ట్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ అండ్ మాస్టర్స్(మెన్ అండ్ ఉమెన్) ఎక్విప్డ్, అన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్– 2024 పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 10 వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, గాయత్రీ ఆశ్రమం వ్యవస్థాపకుడు చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీరాం బదరీనారాయణ, కౌన్సిలర్ కంచేటి గీతారాణి, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

- ఆర్జిత సేవల్లో ఉభయదాతలు
- భక్తులకు గాజుల పంపిణీ



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



గాజులను పంపిణీ చేస్తున్న ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను శుక్రవారం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు, అయ్యప్పలు, శివదీక్షధారులు దర్శించుకున్నారు. అమ్మవారికి తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమంలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గాల ద్వారా భక్తులు కొండపైకి చేరుకుని వీఐపీ, రూ.300, రూ.100 టికెట్లతో పాటు సర్వ దర్శనం క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం మహా మండపం రెండో అంతస్తులో దేవస్థానం అన్న ప్రసాద వితరణ చేపట్టగా, భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. మల్లేశ్వర స్వామి వారిని పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన, సాయంత్రం దీపోత్సవం, ఊంజల్ సేవ నిర్వహించారు. ఆయా సేవలలో భక్తులు, ఉభయదాతలతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

**భక్తులకు గాజులు పంపిణీ**

దుర్గమ్మకి అలంకరించిన గాజులను శుక్రవారం భక్తులకు పంపిణీ చేశారు. మహా మండపం ఎదుట ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేసిన దేవస్థానం సిబ్బంది మహిళలు, యువతులకు గాజులను పంపిణీ చేశారు. ఈవో కె.ఎస్.రామరావు స్వయంగా భక్తులకు అమ్మవారి ప్రసాదంగా గాజులను పంపిణీ చేశారు. అమ్మవారికి అలంకరించిన గాజుల కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తులకు గాజులను పంపిణీ చేశారు.

# వాటర్ స్పోర్ట్స్ భవనాలకు రూ.2 కోట్లు మంజూరు

జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులు కేటాయించిన కలెక్టర్



గత జూన్‌లో జిల్లా స్పోర్ట్స్ అధికారి, క్రీడాకారులతో కలసి భవనాలను పరిశీలించిన కలెక్టర్ బాలాజి

నాగాయలంక/అవనిగడ్డ: స్థానిక కృష్ణానది పరీవాహక ప్రాంతంలో నిర్మాణదశలో ఆగిపోయిన వాటర్ స్పోర్ట్స్ అకాడమీ భవనాల నిర్మాణం కొనసాగింపునకు రూ.2కోట్లు నిధులు కేటాయిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. కృష్ణాజిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నుంచి ఈ మొత్తాన్ని కేటాయించినట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక గత జూన్ 27న స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి కలెక్టర్ బాలాజీ నిలిచిపోయిన వాటర్ స్పోర్ట్స్ అకాడమీ భవనాలను పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను సానుకూలంగా పరిష్కరించే దిశగా అవసరమైతే సంబంధిత మంత్రులతో సంప్రదించి అవసరమైన చర్యలు చేపడతానని చెప్పారు.

# జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఇద్దరు బాలికలు

క్రీడల్లో రాణిస్తున్న నాగాయలంక హైస్కూలు విద్యార్థులు



జాతీయ స్విమ్మింగ్‌కు వెళ్తున్న హైస్కూలు బాలికలతో పీడీ లక్ష్మీప్రసాద్

నాగాయలంక: కృష్ణాజిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 5, 6, 7 తేదీలలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో నాగాయలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన ఇరువురు బాలికలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం పి.వి.ఎన్.వి.ప్రసాద్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం కొక్కిలిగడ్డ విన్నీ 100మీ. ఫ్రీస్టైల్ స్విమ్మింగ్‌లో ద్వితీయ స్థానం, నాగిడి అశ్విని 50మీ. ఫ్రీస్టైల్ స్విమ్మింగ్‌లో ద్వితీయ స్థానం, 200మీ. ఫ్రీస్టైల్ స్విమ్మింగ్‌లో తృతీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిరువురూ డిసెంబరులో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారు. జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన బాలికలను, శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావులను హైస్కూలు స్టాఫ్, పీఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలా మారుతి తదితరులు అభినందించారు.

# ఫైల్స్ సక్రమంగా లేకపోతే ఎలా?



తహసీల్దార్ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, పక్కనే ఆర్డీవో సుబ్రహ్మణ్యం

పెదపారుపూడి: భూమి, ఇళ్ల సమస్యలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవటంతో కలెక్టర్ డీకే బాలాజీ తహసీల్దార్ వై.రంగారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మండలానికి సంబంధించిన భూ సమస్యలు, ఇళ్ల స్థలాల, ఆర్‌ఓఆర్, మ్యుటేషన్ ఫైల్స్‌ను తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులకు ఇబ్బంది లేకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన కలెక్టర్**

స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ డీకే బాలాజీ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. విద్యార్థులతో ముచ్చటించారు. మెనూ ప్రకారం అన్నం, ఆకుకూర, గుడ్డు, చిక్కీ అందించారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రుచిగా, శుచిగా భోజనం అందించాలని ఎంఈవో సురేష్, హెచ్ఎం భవానిలకు సూచించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ సెంటర్‌లో రోగులకు అందిస్తున్న సేవలను తనిఖీ చేశారు. పాము, కుక్కకాటుకు యాంటీరేబిస్ మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వై.రంగారావు, ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మన్యంలో వైద్య సేవలకు విజయవాడ వైద్య విద్యార్థులు



మన్యంలో వైద్య సేవలకు బయలుదేరి వెళ్తున్న వైద్యుల బృందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మన్యం ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న వ్యాధులను గుర్తించేందుకు నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ బృందం శుక్రవారం చింతపల్లి వెళ్లింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వైద్యులు, వైద్య విద్యార్థులతో కూడిన వంద మంది బృందం అక్కడకు వెళ్లారు. వారిలో విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన ఆర్థోపెడిక్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పవన్‌కుమార్, వైద్య విద్యార్థులు లక్ష్య, శిరి, స్నిగ్ధ, మేఘన, ఉర్వి ఉన్నారు. వీరంతా శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజుల పాటు చింతపల్లి పరిసర ప్రాంతాల్లో పర్యటించి గిరిజనులు ఎదుర్కొంటున్న వ్యాధులు, వారి ఆరోగ్య పరిస్థితిని అధ్యయనం చేయనున్నారు. ఒక్కో బృందంలో 8 మంది చొప్పున వైద్యులు, వైద్య విద్యార్థులు బృందాలుగా ఏర్పడి, గిరిజన గ్రామాలను సందర్శించడంతో పాటు, రాత్రి వేళల్లో కూడా వారి ఇళ్లలోనే బస చేయనున్నట్లు డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ పైపులరోడ్డులోని ప్రశాంతి హాస్పిటల్ సమీపంలో నివసిస్తున్న పొన్నంగి వెంకట లహరి బాబు(34) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతనికి భార్య అనితా కుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనిత ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం అతని కుమారుడు భోజనానికి ఇంటికి వచ్చి చూడగా లహరిబాబు కిందపడిపోయి ఉన్నాడు. 108కు ఫోను చేయగా వారు వచ్చి చూసి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉయ్యూరులో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

పైశాచికానందం పొందుతున్న కూటమి శ్రేణులు



ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

ఉయ్యూరు: కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. మహానేత వైఎస్సార్ పేర్లు తొలగిస్తూ, విగ్రహాలను ధ్వంసం చేస్తూ పైశాచికానందం పొందుతున్నారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. నూతన భవనాలను నిర్మించి గ్రామీణులకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తెచ్చింది. నూతన భవన నిర్మాణం పూర్తయిన అనంతరం ఆస్పత్రికి డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వాస్పత్రిగా నామకరణం చేసి వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్ పేరు తొలగించే కుట్రకు పాల్పడింది. పేరు కనిపించకుండా ఫ్లెక్సీని అడ్డుగా ఏర్పాటుచేశారు. తాజాగా గురువారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆస్పత్రి ప్రాంగణంలోని వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. సెక్యూరిటీ గార్డు అప్రమత్తతతో కేకలు వేయడంతో పాక్షికంగా ధ్వంసం చేసి బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటన శుక్రవారం వెలుగు చూసింది. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం పిరికి పంద చర్య అని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి ఈ ఘటనపై స్పందిస్తూ విగ్రహ ధ్వంసం ఘటనపై ఆస్పత్రి పాలకవర్గం, ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించామన్నారు.

### మాకూ వాటా ఉందండోయ్!



ఈ విశ్వంపై మనుషులతో పాటు కోటానుకోట్ల పశుపక్ష్యాదులు, జంతుజాలాలు కూడా జీవిస్తున్నాయి. రైతు ధాన్యాన్ని పండించి సమాజానికి అన్నదాత అయ్యాడు. ఈ ప్రక్రియలో ఆరబెట్టిన ధాన్యం పక్షులకు కూడా ఆహారంగా ఉపయోగపడుతున్నాయి. ఆ విధంగా రైతు పరోక్షంగా పక్షుల క్షుద్బాధను కూడా తీరుస్తున్నాడు. కృష్ణాజిల్లా పరిధిలో బందరు రోడ్డుపై ఆరబెట్టిన వరిధాన్యాన్ని తినేందుకు గుంపుగా చేరిన కొంగలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ